
# పోలీస్ లాకప్



మాకాలనీ కల్చరల్ సెక్రటరీ పార్వతీదేవి చెల్లెలి పెళ్ళికి మా అందరికీ ఆహ్వానాలు వచ్చాయ్. అంతేకాదు. మా కాలనీ సభ్యుల నందరినీ ఓసారి చూడాలని ఉందని వాళ్ళ బంధువులు కూడా ఉత్తరాల మీద ఉత్తరాలు గుప్పిస్తున్నారు! అంచేత  అందరం కలసి ఆ పెళ్ళికి వెళ్ళటం ఉత్తమమయిన మార్గమని పార్వతీదేవి అభిప్రాయపడింది. (ఇటీవల మా కాలనీ వ్యవహారాలు న్యూస్‌పేపర్ల కెక్కటంతో మేము చాలామంది దృష్టిలోకి రావడం జరిగింది)

ఏమైతేనేం– నేనూ, శాయిరామ్, రంగారెడ్డి, జనార్ధన్, యాదగిరి, జర్నలిస్ట్ గోపాల్రావ్ అందరం కలసి భార్యాబిడ్డలతో ప్రయాణం ప్రారంభించాం.

చాలా రోజుల ముందే రిజర్వేషన్ ఏర్పాట్లు చేసేయడం వల్ల హాయిగా స్లీపర్ కోచ్‌లో  ఎక్కి కూర్చున్నాము.

శాయిరామ్ రైల్వే గురించి కొన్ని జోకులు అందరికీ వినిపిస్తున్నాడు. రైలు ఒకటి రెండు స్టేషన్లు దాటిందో లేదో అంతవరకూ మా పక్కనే నిలబడ్డ ఓ గిరజాల జుట్టువాడు మెరుపు వేగంతో మా ఆడాళ్ళ మెడలో గొలుసులు తెంపుకుని, అప్పటికే బాగా స్లో అయిపోయిన రైలు నుంచి దూకి చీకట్లో పారిపోయాడు. మరికొద్ది క్షణాల్లో రైలాగిపోయింది.

"దొంగ దొంగ" అంటూ మేమందరం అరచి వాడివెంట పడ్డానికని బోగీ దిగాము.

కానీకింద ఎత్తులూ, పల్లాలూ, రాళ్ళూ రప్పలూ కాళ్ళకు తగిలేసరికి ఎటూ పరుగెత్తలేక అక్కడే నిలబడి పోయాము.

టీ.టి.ఇ. మా వెనుకే నెమ్మదిగా వచ్చాడు.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాడు తాపీగా.

"వాడెవడో దొంగ వెధవ! ఆడాళ్ళ మెడలో గొలుసు తెంపుకుని బండి దూకి పారిపోయాడు–" ఆత్రుతగా చెప్పాడు శాయిరామ్. జనమంతా మా చుట్టూ మూగారు అప్పటికే.

టీటీఇ చిరాగ్గా చూశాడు మావేపు.

"ఈ మాత్రానికి పెద్ద హడావిడి చేస్తున్నారా? చాల్చాల్లే! ఎక్కండిక బండి!" అన్నాడు అలారం డిస్క్ ఎడ్జస్ట్ చేస్తూ.

"ఏమిటండీ! ఓ పక్క మెడలో నగలు కొట్టేస్తే మీకు చాలా తేలిగ్గా కనబడుతున్నట్లుందే ఇది?" అన్నాడు రంగారెడ్డి.

"మామూలు విషయం కాపోతే– ఇదేం పెద్ద సెన్సేషనల్ వ్యవహారం అనుకున్నారా? మా రైల్వేలో మామూలుగా నగలు రోజూ తెంచుకుని పారిపోతేనే ఉంటారు. మీరు న్యూస్‌పేపర్లు చదవరా?" కోపంగా అడిగాడతను.

ఈలోగా రైలు కదిలింది.

రంగారెడ్డి ఛటుక్కున రైలెక్కి అలారం గొలుసు లాగాడు. రైలు మళ్ళీ ఆగిపోయింది.

"ఏమిటయ్యా– మళ్ళీ గొలుసెందుకు లాగారు?"

"మా ఆడాళ్ళ మెడలో నగల సంగతేమిటో తేలేవరకూ బండిని కదలనీమయ్యా!" కోపంగా అన్నాడు శాయిరామ్.

టీటీఇ కొంచెం తగ్గాడు.

"బండిని ఇక్కడ ఆపి లాభమేమిటండీ! పోయిన నగలు తిరిగొస్తాయా? నాకు పధ్నాలుగేళ్ళ సర్వీసుంది గానీ రైల్లో పోయిన నగలు తిరిగి రావటం చూళ్ళే దెప్పుడూ– కావాలంటే పక్క స్టేషన్లో రైల్వే పోలిస్ స్టేషన్ ఉంది! అక్కడ రిపోర్ట్ చేసుకోండి!"

"అంటే రైల్లో ట్రావెలింగ్ కానిస్టేబుల్స్ అంటూ ఎవరూ ఉండరా?"

"ఏమో సార్! అదంతా మాకు సంబంధం లేదు. మా డ్యూటీ మేము చేయడానికే టైము చాలదు – ఇంకా ఇవన్నీ ఎక్కడచూడమంటారు?"

"సరే– అవన్నీ తేలేవరకూ మేము బండి కదలనీమయ్యా! నీకేమీ సంబంధం లేదుగా! నువ్వూరుకో–" అన్నాడు జనార్థన్ హీరో ఫోజులో! టీటీఇ కేంచేయాలో తోచలేదు.

మిగతా ప్రయాణీకుల వేపు చూశాడు. అందరూ సీరియస్‌గా మాగజైన్లు

చదువుకుంటున్నారు.

కొంతమంది ఆడాళ్ళు అంతకుముందు తమ నగలు రైలు దొంగలు ఎలా కాజేసిందీ తీరిగ్గా ముచ్చటించుకుంటున్నారు.

సరిగ్గా అప్పుడే ఇద్దరు కానిస్టేబుల్స్ కారేజ్‌లో కెక్కారు.

"కోన్ హై- కోన్ చైన్ కీంచే" అధికారం ఉట్టపడే స్వరంతో అడిగాడు ఓ కానిస్టేబుల్.

"ఎవరమ్మా గొలుసు లాగింది?" ఇంకో అతను మరింత గట్టిగా దబాయించాడు.

"మేమేనయ్యా!" అన్నాడు శాయిరామ్.

"ఎందుకు లాగారు?"

"మా ఆడాళ్ళ మెడలో నగలు తెంపుకు పోయారు దొంగ వెధవలు-"

"అయితే? దానికోసం చైన్ లాగుతారా? పక్క స్టేషన్‌కెళ్ళాక రిపోర్టివ్వాలి?"

"అంటే- ఇక్కడ మీరేం చెయ్యరా?" కోపంగా అడిగాడు రంగారెడ్డి.

"మేమేం చేస్తాం? ఎవడు మాత్రమేం చేస్తాడు ఈ చీకట్లో? అయినా మా డ్యూటీ అదికాదు-"

"ఏమిటి? పోలీసుల డ్యూటీ దొంగల్ని పట్టుకోవడం కాదా?"

"మా డ్యూటీ అలారం చైన్ లాగిన వాళ్ళను పట్టుకోవడం! అడ్డమైనోడూ అలారం చైన్లు లాగటం వల్ల రైళ్ళు లేటవుతున్నాయని అలారం చైన్ స్క్వాడ్ వేసింది రైల్వే!"

"రోజూ ప్రయాణీకుల మెడలో నగలు కొట్టేస్తున్నారని "గోల్డ్ చైన్ తెఫ్ట్ స్క్వాడ్" ఎందుకు వేయదు మీ రైల్వే!"

"అది రైల్వేకు సంబంధం లేదయ్యా! రైల్వే పోలీస్ చూచుకుంటుందవన్నీ-"

"రైల్వే పోలీసా? మరి మీరెవరు?"

"మేము ఆర్.పి.యఫ్-"

ఓ కానిస్టేబుల్ వెళ్ళి అలారం చైన్ డిస్క్‌ని మళ్ళీ ఎడ్జస్ట్ చేశాడు.

రైలు కదిలింది మళ్ళీ.

"ఊ చెప్పడి! మీ పేర్లేమిటి?" ఓ కానిస్టేబుల్ దగ్గరకొచ్చి నోట్‌బుక్ తీస్తే అడిగాడు.

"ఎందుకు?"

"అలారం చైన్ లాగినందుకు కేస్ పెట్టాలి!"

"ఏమిటి? అలారం చైన్ లాగినందుకు కేస్ పెడతావా? నీకేమయినా బుద్ధుందా?"

కానిస్టేబుల్ కోపంగా చూశాడు.

"ఏయ్ మిస్టర్! సంబల్‌కే బాత్ కరో! లేకుంటే గలత్ మాటలు చెప్పినందుకు ఇంకొక కేస్ అవుతది-"

"లేకపోతే ఏమిటయ్యా! బంగారు నగలు పోయాయని మేము చెప్తుంటే అలారం

గొలుసు గొడవేమిటి మధ్యలో?" రంగారెడ్డి మండిపడ్డాడు.

కానిస్టేబుల్‌కి రెడ్డి వ్యవహారం చూసి కోపం ముంచుకొచ్చింది.

"అరెస్ట్!" అని అరచాడు గట్టిగా.

బోగీలో అందరూ ఉలిక్కిపడ్డారు ఆ కేకకు. నిద్రపోతున్న చిన్నపిల్లలు కొంతమంది దడుసుకుని కెవ్వుమంటూ ఏడ్వసాగారు.

"ఎవరా సచ్చినోడు అలా అరచాడు! లేదు లేమ్మా ఊరుకో! ఏడవకు–" అందో తల్లి.

"అరెస్ట్ చేసెయ్ ఇతన్ని–" ఆ కానిస్టేబుల్ ఇంకో కానిస్టేబుల్‌తో మళ్ళీ చెప్పాడు.

రెండో కానిస్టేబుల్ రంగారెడ్డి భుజం మీద చేయి వేయబోయాడు గానీ, రంగారెడ్డి ఒక అడుగు వెనక్కు వేస్తూ "మీద చెయ్యిపడిందో జాగ్రత్త!" అంటూ బెదిరించాడు.

ఈ లోగా రైలు స్టేషన్లో ఆగింది.

అందరూ సామాన్లతో సహా దిగిపోయి ప్లాట్‌ఫారం మీదున్న రైల్వే పోలీస్ స్టేషన్‌లో కెళ్ళాము.

అరెస్ట్ చేస్తామని బెదిరించిన ఆ కానిస్టేబుల్స్ ఏమయ్యారో ఎంత వెతికినా కనిపించలేదు.

పోలీస్‌స్టేషన్లో ఇన్‌స్పెక్టర్ మమ్మల్ని చూస్తూనే మొఖం చిట్లించాడు.

"ఏం గావాలా?"

"మేము ఇప్పుడు వెళ్ళిన ఎక్స్‌ప్రెస్‌నుంచి దిగామండీ!" చెప్పాడు శాయిరామ్.

"ఏం గావాల?"

"మధ్యలో ఒక దొంగ మా ఆడాళ్ళ మెడలో నగలు తెంపుకుని రైలు దూకి పారిపోయాడండీ!" రంగారెడ్డి జవాబిచ్చాడు.

"మేమేం చేయాల!" మళ్ళీ అడిగాడతను.

అందరం మొఖాలు చూసుకున్నాం.

"దొంగను పట్టుకోవాలండీ?" చెప్పాడు శాయిరామ్ శాంతంగా.

"ఎందుకు పట్టుకోవాల?"

రంగారెడ్డికి మళ్ళీ కోపం ముంచుకొచ్చింది.

"సరదాకండీ! పోలీసులు దొంగల్ని ఎలా పట్టుకుంటారో చూడాలని మా ఆవిడకు ఎప్పటి నుంచో చాలా సరదా! అందుకని ..." అన్నాడు వ్యంగ్యంగా.

ఇన్‌స్పెక్టర్‌కి వళ్ళు మండిపోయినట్లుంది.

"ఇన్‌కో అందర్ దాల్‌దొజీ–" అతన్నాడు పక్కనే నిలబడ్డ కానిస్టేబుల్‌తో.

కానిస్టేబుల్స్ ఇద్దరు వచ్చి రంగారెడ్డిని లాక్కెళ్ళి లాకప్‌లో వేసేశారు.

అందరం నిశ్చేష్టులయిపోయాము.

కొద్దిక్షణాల తరువాత నేనూ, జనార్ధన్ కోలుకున్నాము.

"దిసీజ్ టూమచ్! కంప్లెయింట్ ఇవ్వటానికొస్తే అరెస్ట్ చేస్తారా?" అన్నాన్నేను.

"మీకేం కావాలి?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ మళ్ళీ.

"మావాడినెందుకు అరెస్ట్ చేశారు?" నేను కోపంగా అరచాను.

"ఇన్‌కో భీ అందర్ దాల్‌దోజీ–" కానిస్టేబుల్స్‌తో చెప్పాడతను. కానిస్టేబుల్స్ నన్ను కూడా తీసుకెళ్ళి లాకప్‌లో రంగారెడ్డి పక్కకుతోశారు. గోపాల్రావ్ ఇంక ఆలస్యం చేయలేదు.

తన జేబులోనుంచి ప్రెస్ ఎక్రిడిషన్ కార్డు తీసి ఇన్‌స్పెక్టర్‌కి చూపించాడు.

"నేనే పత్రికా విలేఖరిని! ఇక్కడ జరుగుతుందంతా పేపర్లలో రాయదల్చు కున్నాను–" అన్నాడు చిరునవ్వుతో.

హఠాత్తుగా ఇన్‌స్పెక్టర్ ధోరణిలో మార్పు వచ్చింది.

"ఏం గావాల?" అన్నాడు ఈసారి సౌమ్యంగా!

"మా నగలు రన్నింగ్ ట్రైన్‌లో ఎవడో కొట్టేశాడు–"

"ఏడ?"

"రెండు స్టేషన్ల ముంగల–" అన్నాడు యాదగిరి.

"అయితే ఈడకెందుకొచ్చిన్రు?"

"రిపోర్టిచ్చెడిది ఈడగాదు– సికింద్రాబాద్‌లో"

"అదేమిటి? ఇక్కడెందుకివ్వకూడదు?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"ఇన్‌కోభీ అందర్..." అని అనబోయి ఎంచేతో అనకుండా ఆపేశాడు.

"దొంగతనం మా ఏరియాలో జరగలే! సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఇలాఖా అది!"

ఇంక మాకక్కడ చేయగలిగిందేమి లేదనిపించింది.

"ఓ దోనోంకో ఛోడ్‌దోజీ–" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

నన్నూ, రంగారెడ్డినీ లాకప్ నుంచి బయటకు తోలేశారు వాళ్లు.

అందరం కలసి బస్‌లో సికింద్రాబాద్ స్టేషన్ చేరుఉకుని రైల్వే పోలీస్ స్టేషన్‌లో కెళ్ళాం.

అక్కడ సబ్‌ఇన్‌స్పెక్టర్ సీరియస్‌గా పలుకరించాడు.

"ఏం జరిగింది?"

జరిగిందంతా చెప్పాడు శాయిరామ్.

"దొంగ ఎట్లా వుంటాడు?"

అందరం మొఖాలు చూచుకున్నాం.

"గిరజాల జుట్టుందండీ!"

"మొఖం ఎలా వుంది?"

"సరిగ్గా చూడలేదండి!"

"రైళ్ళలో ప్రయాణం జేసేప్పుడు నగలు ఎవరు పెట్టుకోమన్నారు?"

"పెట్టుకోకూడదాండీ?" అడిగాడు రంగారెడ్డి కోపంగా.

శాయిరామ్ రంగారెడ్డిని వెనక్కు లాగేశాడు.

"పెట్టుకుంటే ఇట్లాగే కొట్టేస్తారు!"

"మరి మీరున్నది ఎందుకండీ?" హీరోలాగా రెండు చేతులూ నడుము మీద పెట్టుకుంటూ అడిగాడు జనార్ధన్.

తనను లాకప్‌లో పడేస్తారేమోనని మేము జనార్ధన్‌కి అడ్డువెళ్ళాము.

"ఎన్ని తులాలుంటుంది. గొలుసు?"

"మా ఆవిడది రెండు తులాలు- యాదగిరి భార్యది ఒకటిన్నర తులం" అన్నాడు శాయిరామ్.

"కంప్లెయింట్ రాసివ్వండి?"

ఇద్దరూ కంప్లెయింట్ రాసిచ్చారు.

"ఇక పోండ్రి!" అన్నాడు హెడ్ కానిస్టేబుల్.

"ఎక్కడికి?"

"ఏడకు పోతారో మాకే మెరుక?"

"మరి మా నగలో?"

"దొరికితే కబురు జేస్తాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

నెల- రెండు నెలలు కూడా అయిపోయింది.

నేనూ, శాయిరామ్ చాలాసార్లు ఆ ఇన్‌స్పెక్టర్‌ని కలుసుకున్నాం. గానీ లాభం లేకపోయింది.

"రోజుకి అరడజను మంది నగలు పోగొట్టుకుంటున్నారయ్యా- ఎంతమందివని దొరుకుతాయ్?" అన్నాడతను.

ఓరోజు గోపాల్రావ్ హడావిడిగా యాదగిరి, శాయిరామ్‌లతో పాటు మా ఇంటి కొచ్చాడు.

"పదండి గురూ! నిన్న ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పోలీస్ కమీషనర్ గారితో పరిచయమయింది. వెంటనే మన నగల దొంగతనం గురించి చెప్తే వివరాలు కావాలన్నారు" అన్నాడతను.

అందరం ఆటోలో ఆయన ఆఫీస్‌కి వెళ్ళి జరిగిందంతా వివరించాము.

ఇది జరిగిన వారం రోజులకు ఓ రైల్వే పోలీస్ కానిస్టేబుల్ మా కాలనీకొచ్చాడు. శాయిరామ్, యాదగిరిల అడ్రస్ తీసుకుని.

"ఏమిటి సంగతి?" అడిగాం అతనిని.

"ఇన్‌స్పెక్టరు గారు- ఈ సార్ లిద్దర్నీ తీసుకురమ్మన్నారు సార్!"

"ఎందుకు?"

"ఏమో సార్!"

అందరం బయల్దేరి వెళ్ళాము.

ఇన్‌స్పెక్టర్ చాలా ఆదరంగా ఆహ్వానించాడు మమ్మల్ని.

"ఏయ్! త్రీ బై సిక్స్ ఛాయ్ తీసుకురమ్మను" అంటూ కానిస్టేబుల్‌ని పురమాయించాడు.

మేం ఆశ్చర్యపోయాం పోలీసుల్లో కనీ వినీ ఎరుగని ఆ ఆప్యాయతకు.

అందరం 'టీ' తాగాము.

"కమీషనర్ సాబ్ మీ కేస్ గురించి ఫోన్ చేశారు. మీ నగలేమో ఇంతవరకూ దొరకలేదు. అంచేత మీరు 'సరే' నంటే ఓ పనిచేద్దాం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏమిటది?"

"మీ యిద్దరికీ చెరో గొలుసూ యిస్తారు. ఒకటేమో ఒక తులం– ఇంకోటేమొ ముప్పావు తులం– అవి తీసేసుకుని మీ నగలు మీకు దొరికాయని రాసిచ్చెయ్యండి"

మేము అదిరిపడ్డాం.

"అదేమిటి? అలా ఇంకొకరి నగలు తీసుకొవటం తప్పు కదూ?" అడిగాడు శాయిరామ్.

"తప్పూ లేదు ఏమీ లేదండీ! మీ నగలు దొరుకుతాయో లేదో నమ్మకం లేదు. ఒకవేళ దొరికితే మీ కంటె ఎక్కువ తులాల బంగారం పోయినవారికి అవిస్తాము– ఇలా అందరికీ కొంతవరకూ 'అడ్జస్ట్' అవుతుంది కదా– మీ ఇష్టమయితేనే– లేపోతే లేదు! కమీషనర్ సాబ్ చెప్పారు కాబట్టి ఈ ఆఫరయినా"

మాలో మేము అరగంట మాట్లాడుకుని చివరకు ఏదో నగ తీసుకొవటమే మంచిదని నిర్ణయించుకున్నాం. లేపోతే మొత్తం నష్టమే కదా!

అతను ఆ రెండు తెగిన గొలుసులూ తీసి మాకు చూపించాడు.

"జాగ్రత్తగా గుర్తు పెట్టుకోండి! రైల్వే మేజిస్ట్రేటు మిమ్మల్ని ఈ రెండూ చూపించి ఇవి మీవేనా అని అడిగానప్పుడు మావే అని చెప్పాలి– సరేనా?"

"సరే–"

వారం రోజుల తరువాత మేజిస్ట్రేట్ కోర్టుకెళ్ళి ఆ నగలు గుర్తించి తీసుకున్నాం.

ఇన్‌స్పెక్టర్ బయట కనిపించాడు మళ్ళీ.

"కమీషనర్ సాబ్‌తో – ఈ గొడవంతా చెప్పకండి! మీ నగలు మీకు దొరికాయని చెప్పండి! ఏమంటారు?"

"సరే!" అన్నాం చేసేదిలేక.

ఆ రోజు నుంచీ మా కాలనీలో ఎవరూ నగలతో ప్రయాణాలు చేయలేదు మళ్ళీ.